క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



మక్తల్: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ భీమా అధ్యక్షుడు అంబాదాస్‌రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 150మంది రోగులకు చికిత్సలు చేయగా వారిలో కంటి ఆపరేషన్‌కోసం 53మందికి కంటి సమస్యలు ఉందని ఆపరేషన్‌కోసం ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి వాహనంలో తరలించారు. కంటి పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంబాదాస్, అనుగొండ శ్రీనివాసులు, రమేష్‌రావు, చంద్రకాంత్‌గౌడ్, పృథ్వీరాజ్, రాకేష్, కట్టవెంకటేష్, శంకర్ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికీ గాయాలు

మాగనూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గద్వాల జిల్లా ఇంకిచేడు గ్రామానికి చెందిన వేమారెడ్డి, వీరారెడ్డి సొంతపనుల నిమిత్తం రాయచూర్ నుంచి మక్తల్‌కు తమ బైక్‌పై వస్తుండగా మాగనూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాయచూర్‌కు తరలించారు. ఈ విషయంపై వేమారెడ్డి భార్య పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసున మోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ఊట్కూరు: మండలంలోని మల్లేపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం నర్సింగప్ప, బీఆర్‌పీ శ్రీకాంత్, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డి గ్రామానికి చెందిన కుంబరి నర్సప్ప కృష్ణానది నుంచి గురువారం రాత్రి తన ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా స్థానిక ఏఎస్ఐ సురేంద్రబాబు పట్టుకుని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కృష్ణానది నుంచి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కేసున మోదుతోపాటు వాహనాలను సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

మక్తల్: మండలంలోని అంకేన్‌పల్లికి చెందిన సువ్వన్న, అశోక్ అనే రైతులకు చెందిన రెండు గడ్డివాములు శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ఉన్న గడ్డివాములు దహనం కావడంతో పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ. 25వేల ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకోవాలని మాజీ సర్పంచ్ లక్ష్మణ్ కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్

కృష్ణా: మండలంలోని కృష్ణానది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రూ. 25వేలు జరిమానా విధిస్తామని తహసీల్దార్ దయాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణానికి గాను మండలంలోని గుడెబల్లూర్, గుర్జాల్, తంగిడి, హిందుపూర్, ముడుమాల్ గ్రామాలకు మొత్తం ఇప్పటివరకు 63ట్రాక్టర్ల ఇసుకను తరలించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. అదేవిధంగా సీసీ రోడ్డు నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్న సమయంలో రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఇసుకను సీజ్ చేయడంతోపాటు ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆటలు.. ఆడేదెలా?

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- మూలనపడ్డ క్రీడా సామగ్రి
- ఆటలకు దూరమవుతున్న క్రీడాకారులు



ముళ్లపొదలతో నిండిపోయిన కొండ్రోన్‌పల్లి క్రీడా మైదానం (ఫైల్)



నిరుపయోగకరమైన క్రీడా మైదానం (ఫైల్)

ధన్వాడ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో గత ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. ఇందుకోసం దాదాపు రూ.4 లక్షల వరకు నిధులు కేటాయించి నిర్మాణ పనులను చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో అప్పటి ఎమ్మెల్యేలు సామగ్రిని పంపిణీ చేశారు. వీటిని గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉంచి ఆటలు ఆడుకునే వారికి సామగ్రిని ఇచ్చి పంచాయతీలకు అప్పగించాలని రూల్స్ పెట్టింది. కానీ, వాటిని గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో క్రీడా సామగ్రి మూలనపడింది. ప్రభుత్వం క్రీడా సామగ్రి అందజేసిన కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో ప్రస్తుతం క్రీడాకారులకు ఉపయోగపడటం లేదు.

పంట పొలాల్లో ప్రాంగణాలు..

క్రీడా ప్రాంగణాలు పంట పొలాల్లో ఏర్పాటు చేయడంతో చుట్టూ రైతులు పంటలు వేయడంతో క్రీడా ప్రాంగణాలకు వెళ్లేందుకు దారి లేక పిచ్చి మొక్కలు పెరిగి ముళ్లకంపలకు నిలయంగా మారుతున్నాయి. క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ వీటి నిర్వహణ కరువైంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాల బోర్డు తప్ప ఇంకేమి కనిపించడంలేదు. ప్రభుత్వ పాఠశాలల మైదానాలకు క్రీడా ప్రాంగణాలుగా చేసి బోర్డులు పెట్టడంతో బయటి యువకులు ఆడుకోవడానికి వచ్చే పరిస్థితి లేదు. నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయాల్సిన సామగ్రిని వృథాగా పడేశారు. బిల్లులు చెల్లించిన గుత్తేదారులు పనులు సరిగ్గా నిర్వహణ చేయలేదు. క్రీడా ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా ఎంపిక చేశారు. క్రీడా ప్రాంగణాలు శుభ్రం చేసి క్రీడా సామగ్రిని అందించి ఆటల్లో మరిన్ని మెలకువలతో రాణించే అవకాశం కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

అనుకూలంగా లేదు..



పంచాయతీలు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఆటలాడేందుకు అనుకూలంగా లేవు. అక్కడ క్రీడా ప్రాంగణం అనే బోర్డు తప్ప ఇంకేమి లేవు. పిచ్చిమొక్కలు పెరిగి ముళ్లపొదలు పేరుకుపోతున్నాయి. క్రీడా సామగ్రి ఎక్కడ ఉందో కూడా తెలియడం లేదు. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు చదునుచేసి సామగ్రి అందజేయాలి.

- నాగేష్, రామకిష్టాయిపల్లి

వినియోగంలోకి తీసుకొస్తాం..

ఆయా పంచాయతీల పరిధిలో క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకొస్తాం. క్రీడా సామాగ్రిని క్రీడాకారులకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

- సాయిప్రకాష్, ఎంపీడీఓ, ధన్వాడ

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మక్తల్: మండలంలోని గుడిగండ్లలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. చక్కగా పాఠాలు బోధించిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం గురురాజరావు, హెచ్ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు హిమబిందు, పార్వతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు గృహజ్యోతిని వర్తింపజేయాలి



మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కోస్గి: ప్రభుత్వ బడులకు గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి ఏలాగైతే వర్తింపజేస్తున్నారో అలాగే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేస్తూ, విద్యుత్ బకాయిలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి నర్సింహా, కో శాధికారి కిషోర్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గృహజ్యోతి పథకం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకుడు నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల లోపు గృహజ్యోతిని లబ్ధిదారులకు వర్తింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్, ఎల్లాగౌడ్, మౌలాలి, నాగరాజు, కాలప్ప, ఆకుల హజు, బాలప్ప, వాణి రా జశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి బెంచీల వితరణ



బెంచిలను అందజేస్తున్న దాతలు

మరికల్: మండల తహసీల్దార్ కార్యాలయానికి దాతలు నాలుగు సిమెంట్ బెంచిలను వితరణ చేశారు. మండలానికి చెందిన వైడిగుప్తా రాములు దాత నాలుగు సిమెంట్ బెంచిలను తయారు చేయించి శుక్రవారం కార్యాలయానికి అప్పగించారు. కార్యాలయానికి వచ్చే జనాలకు కూర్చీలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో దాతలు ముందుకొచ్చి బెంచీలు అందజేయడం అభినందనీయమని తహసీల్దార్ సునిత అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం చాటుకోవాలి



వారోత్సవాల్లో పాల్గొన్న మహిళలు

మహబూబ్‌నగర్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ సమానత్వం చాటుకోవాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ అరుణ, సఖీ సెంటర్ అడ్మిన్ సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని షాసాబ్‌గుట్ట, రామయ్యబౌలి ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, డాక్టర్ గౌతమి, డాక్టర్ రమ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి కృషి



దరఖాస్తు పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

ఆత్మకూర్: ధరణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, తొమ్మిది రోజుల్లో ఫిర్యాదులన్ని పరిశీలిస్తామని తహసీల్దార్ రాజు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలనను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ తొమ్మిది రోజుల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. భూ సమస్యలు, తప్పు ఒప్పులు, ఇతరాత్ర దరఖాస్తులన్నింటిని పరిశీలించి నివేదించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ చానక్య, ఆర్ఐ జయమ్మ, జూనియర్ ప్రసాద్, వరుణ్ పాల్గొన్నారు.

మెటర్నిటీ ఆస్పత్రి అందుబాటులోకి తేవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ కాంప్లెక్స్ వెనుకలో గతంలో నిర్మాణం చేపట్టిన మెటర్నిటీ ఆస్పత్రి భవనాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని ఈమాన్ కమిటీ ఫౌండర్ ఎండి.సలీం కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పలు ప్రజా, సామాజిక సంఘాలతో కలిసి మోటార్‌లైన్‌లోగల మెటర్నిటీ ఆస్పత్రిని పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సుల్తాన్, తకీ, సయ్యద్ గౌస్, ఉమర్, కురుమూర్తి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

కృష్ణా: బీజేపీలో కొంతకాలంగా జరుగుతున్న అంతర్గత పరిణామాలతోపాటు కృష్ణాలో ఎక్స్‌ప్రెస్ ట్రిన్‌లను నిలపాలని కోరుతున్నా పట్టించుకోకపోవడంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేసినట్లు అమర్‌కుమార్ దీక్షిత్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వయస్సు మీద పడటంతో క్రియాశీలకంగా పని చేయలేక పోతున్నానని, ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులుకు పంపించినట్లు చెప్పారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

మక్తల్: ట్రిస్మా రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యక్షుడిగా అంజిరెడ్డి శుక్రవారం ఎంపిక కావడంతో ఆయనకు శాలువాతో సన్మానం చేశారు. మక్తల్‌కు చెందిన అంజిరెడ్డికి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడంతో కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

3న ఆత్మీయ సమ్మేళనం

మక్తల్: తెలంగాణ రాష్ట్ర గౌడకులస్తుల సంఘం ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 3న మహబూబ్‌నగర్‌లో నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలో గౌడకులస్తులు, ప్రజాప్రతినిధులు, గీత కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బోక్కల వెంకట్‌రెడ్డి, చాంద్‌పాష అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడంతో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఏ ఆపదవచ్చిన అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్, హర్షవర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయండి



అమరచింత: పద్దెనిమిది నెలల కిందట ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. గుడిసెలు వేసుకొని నివసిస్తున్న లబ్ధిదారులకు ప్లాట్‌ల హద్దులు చూపాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి, అజయ్, వెంకటేష్ డిమాండ్‌ చేశారు. దుంపాయికుంటలో గుడిసెలు నిర్మించికుని అక్కడే జీవిస్తున్న లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న, అనంతమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఈనెల 4 నుంచి మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో చేపట్టే న్యాయ్‌యాత్రను విజయవంతం చేయాలని నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మహబూబ్‌నగర్ మండల, హన్వాడ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్‌పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, నర్సింహారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

ఊట్కూరు: మండలంలోని తిప్రాసిపల్లిలో శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ పథకంతో రూ. 5లక్షల నిధులచే సీసీరోడ్డు పనులను మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రతి గ్రామంలో లక్షల రూపాయలతో సీసీ రోడ్లను వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు కొక్కు లింగం, నాయకులు వెంకటేష్‌గౌడ్, ఆంజనేయులు, సత్యనారాయణ, రామకృష్ణ, బాలప్ప పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివస్వాములు



మద్దూర్‌లో పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్న శివస్వాములు

మద్దూరు: మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన శివస్వాములు శుక్రవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. శివస్వాములు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో గురుస్వాములచే ఇరుముడులను కట్టుకొని మేళతాళాల మధ్య ఊరేగింపుగా కుటుంబ సభ్యులు స్వాములను సాగనంపారు.



నర్వలో..

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం శివస్వాములు ఇరుముడి కట్టుకుని అనంతరం భిక్ష పూర్తిచేసుకుని శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా స్వాములు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ముందుగా ఈ ఇరుముడులు కట్టుకుని బయలుదేరినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



అచ్చంపేటలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

మద్దూరు: మండల పశువైద్యశాఖ అధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యురాలు విశాల తెలిపారు. ఈ టీకాల కార్యక్రమం ఈ నెల 25వరకు గ్రామాల్లో కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏ రాజశేఖర్, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: పశువులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు గాలికుంటు నివారణ టీకాలు వినియోగించుకోవాలని పశువైద్యురాలు యశోద సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అచ్చంపేట, ఓబ్లాపూర్ గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పశువుల కాపరులు తప్పకుండా వారి పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది వినయ్‌కుమార్, యశోద, లక్ష్మి, నాగప్ప పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన భక్తులు



ఊట్కూర్ నుంచి అయోధ్యకు తరలివెళ్తున్న రామభక్తులు

నర్వ: అయోధ్య క్షేత్రాన్ని సందర్శించేందుకు యాంకి గ్రామానికి బీజేపీ, విశ్వహిందుపరిషత్, భజరంగ్ దళ్ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించే అవకాశం రావడం పూర్వజన్మ పుణ్యమని వెళ్లిన నాయకులు మాట్లాడారు. ఆలయాన్ని సందర్శించే క్రమంలో బీజేపీ యువ నాయకులు మిథున్‌రెడ్డిని కలిసినట్లు వారు పేర్కొన్నారు. వెళ్లిన వారిలో గుజ్జుల వెంకటేష్, శ్రీనివాసులు, లలిత వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఊట్కూరు: మండలం నుంచి శుక్రవారం రాముడి దర్శనం కోసం అయోధ్యకు రామభక్తులు బయలుదేరారు. గ్రామం నుంచి సుమారు 20 మంది అయోధ్యకు బయలు దేరి వెళ్లారు. భక్తులు అశోక్, యామారెడ్డి, నందు, బాలప్ప, రాజు, జి నారాయణ, గజలప్ప తరలివెళ్లారు.



నర్వ నుంచి..

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి



మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీడీఓ

అమరచింత: వేసవిలో మొక్కలు వాడుముఖం పట్టకుండా ప్రతినిత్యం నీటిని అందించి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మస్తీపురంలో శుక్రవారం రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలకు నీటిని అందించారు. మొక్కల సంరక్షణలో అలసత్వం కనబరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమరుల సాక్షిగా వర్గీకరణ సాధిస్తాం



తెలంగాణ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలోఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించారు. నాయకులు పోలే బాలయ్య, బాలరాజు, ఖాదరయ్య, వినోద్‌కుమార్, కొండయ్య, శ్రీనివాసులు, బాలనాగయ్య, కమలాకర్, గణేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం..



మ్యాతరి పుష్పను సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: స్థానిక మున్సిపాలిటీలో నాలుగు దశాబ్దాలకు పైగా సఫాయి కర్మచారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన మ్యాతరి పుష్పను శుక్రవారం బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. నాగురావునామాజీ మాట్లాడుతూ.. సఫాయి కార్మికులు తమ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా మురుగును తొలగించి సమాజాన్ని స్వచ్ఛతవైపు తీసుకుని వెళ్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సెక్రటరీ రఘురామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.